క్లుప్తంగా

కాకాని విగ్రహాన్ని పునరుద్ధరించాలని వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దివంగత మంత్రి కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని బెంజి సర్కిల్‌లో పునరుద్ధరించి, కాకాని సర్కిల్‌గా మార్చాలని కాకాని ఆశయ సాధన సమితి కోరింది. ఈ మేరకు సమితి అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని, మోతుకూరి వెంకటేశ్వరరావు(సర్వోదయ స్వాతంత్ర్య సమరయోధుల సంఘం), రామకృష్ణ చౌదరి గుమ్మడిలు సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆగస్టు 3న కాకాని జయంతి సందర్భంగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చెస్ టోర్నమెంట్ విజేతకు అభినందన



మధురానగర్(విజయవాడసెంట్రల్): నెల్లూరులో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో అజిత్‌సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీ విద్యార్థి బత్తుల భానుప్రకాష్ అండర్ -16 విభాగంలో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా అకాడమీలో భానుప్రకాష్‌కు సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. అకాడమీ డైరెక్టర్ కోచ్ అవ్వారు రామకృష్ణ భానుప్రకాష్‌ను జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భానుప్రకాష్ తన ర్యాపిడ్ రేటింగ్‌ను 68 పాయింట్‌లు సాధించటం ద్వారా తన రేటింగ్‌ను 1084కు మెరుగు పరుచుకున్నారన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్తమ ప్రదర్శన చేయాలని ఆకాంక్షించారు.

సత్తా చాటిన సెయింట్ ఆన్స్ విద్యార్థులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ, తెలంగాణ రీజనల్ గేమ్స్ షటిల్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని అజిత్‌సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆషా జార్జి తెలిపారు. పాఠశాలకు చెందిన డి.శతమన్యు, ఆర్.కార్తీక్ కుమార్ అండర్ – 17 విభాగంలో డబుల్స్‌లో ప్రథమ స్థానం, సింగిల్స్ విభాగంలో శతమన్యు ప్రథమ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను సోమవారం అభినందించారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శనతో పాఠశాల, నగర పేరు ప్రఖ్యాతులు ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిస్టర్ సరోజిని, వ్యాయామ ఉపాధ్యాయులు బి.జోసఫ్, ఈ.డేవిడ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల గంటల ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన బాట పట్టారు. కోర్కెల దినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు 36 గంటల ధర్నా చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో కంటే అదనంగా వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, మరో 11 డిమాండ్లను పరిష్కారం చేయాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీలు తెలిపారు. ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, వివిధ పార్టీల, సంఘాల నాయకులు సీహెచ్ బాబురావు, డి.వి.కృష్ణ, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కె.ధనలక్ష్మి, డి.రమాదేవి, మాల్యాద్రి పాల్గొన్నారు. ఈ నెల 12న జరగనున్న క్యాబినెట్ సమావేశంలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపాలని కోరారు.

చేనేత వృత్తిదారులపై దాడి శోచనీయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చేనేత కార్మికుల నుంచి చీరలను కొనుగోలు చేసిన వ్యాపారులు వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా వేధింపులకు గురి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ.రావు డిమాండ్ చేశారు. కేఎల్‌రావు నగర్‌లోని ఋత్విక్ డిగ్రీ కాలేజీ ఆవరణలోని బీసీ ఇంటర్నేషనల్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎన్వీ.రావు మాట్లాడుతూ.. ధర్మవరం వ్యాపారులపై విజయవాడ, గుంటూరుకు చెందిన వ్యాపారులు దాడికి పాల్పడటం శోచనీయమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంతో పాటు షోరూం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యాపారులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్, సంయుక్త కార్యదర్శి పట్నాయక్, కార్యవర్గ సభ్యుడు వెంకట్రావు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కార వేదిక 'జగనన్న సురక్ష'

- దేశానికే ఆదర్శంగా వార్డు సచివాలయం, వలంటీర్ వ్యవస్థ
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో సత్వరమే పరిష్కరించేందుకు వేదికగా జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేశారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 31వ డివిజన్ ముత్యాలంపాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని రీతిలో మన రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగుతోందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంతకు ముందెన్నడూ లేని విధంగా సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి.. చెప్పిన తేదీకే లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదును జమ చేస్తున్నామని చెప్పారు. శాచ్యురేషన్ పద్ధతిలో నగరాలు, పట్టణాల్లోని 87 శాతం మంది ప్రజలకు ఏదో ఒక పథకం రూపంలో మేలు చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

వలంటీర్ల వ్యవస్థపై ఎందుకంత కడుపు మంట..?

జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే విష్ణు ధ్వజమెత్తారు. వలంటీర్ వ్యవస్థపై పవన్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అందుతున్న సేవలపై ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తుంటే.. పవన్‌కు ఎందుకంత కడుపు మంట అని ప్రశ్నించారు. తెలుగుదేశం హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో అందిన కాడికి దోచుకున్నారన్నారు. అర్హతను పట్టించుకోకుండా జన్మభూమి కమిటీలు వారు సూచించిన వారికే పింఛన్లు అందించేవారని గుర్తుచేశారు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలను అందిస్తున్నామని విష్ణు తెలిపారు. మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని చెప్పారు. వలంటీర్లు నిర్వహించిన సర్వే ద్వారా డివిజన్‌లో 1,547 మంది వివిధ రకాల పత్రాల కోసం వినతులు సమర్పించారన్నారు. వాటిలో 772 మంది కుల సర్టిఫికెట్లకు, 758 మంది ఆదాయం, ఇద్దరు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఐదుగురు కొత్త రేషన్ కార్డులకు అర్జీలు అందించారని చెప్పారు. వారందరికీ ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీవోయూసీడీ శకుంతల, అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి పెనుమత్స సత్యం, సామంతపూడి చిన్నా, పి.పట్టాభిరామరాజు, టి.మురళీకృష్ణంరాజు, వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ శిరీష తదితరులు



అవగాహన కల్పిస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ



32వ డివిజన్‌లో జగనన్న సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

'జగనన్న సురక్ష'పై అవగాహన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జగనన్న సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ కోరారు. 58వ డివిజన్‌లో సోమవారం ఆమె ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. 11 రకాల సర్టిఫికెట్లు అవసరమైన వారు వలంటీర్లు మీ ఇంటికి వద్దకు వచ్చినప్పుడు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 17వ తేదీన 58వ డివిజన్‌లో జరిగే జగనన్న సురక్ష శిబిరంలో దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో 'జగనన్న సురక్ష'

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్ పాల్‌తో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లో వలంటీర్లు, వార్డు కార్యదర్శులు, గృహ సారథులు, కన్వీనర్లతో కూడిన బృందం వారం రోజుల నుంచి డివిజన్‌లో 3,291 గృహాల్లో విస్తృతంగా సర్వే నిర్వహించారన్నారు. సదరు సర్వేలో 1,768 మంది వివిధ రకాల పత్రాల కోసం వినతులు సమర్పించారన్నారు. వాటిలో 717 మంది కుల సర్టిఫికెట్లకు, 1,040 మంది ఆదాయ సర్టిఫికెట్లకు అర్జీలు అందజేశారని చెప్పారు. దరఖాస్తుదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీవోయూసీడీ శకుంతల, నార్త్ ఎమ్మార్వో మాధురి, నాయకులు ఒగ్గు గవాస్కర్, అన్ని శాఖల అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలి



ఆటోనగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆటోనగర్‌లోని ఆరో రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును సోమవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ చెత్త వాహనాలను వేయింగ్ మిషన్ బ్రిడ్జి పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. క్లాప్ ఆటోకు అందిస్తున్న చెత్తను పరిశీలించి ప్రజలందరూ తప్పనిసరిగా చెత్తను వేరు చేసి మూడు బుట్టల్లో ఇవ్వాలన్నారు. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సిబ్బందికి తెలిపారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తే సహించేది లేదన్నారు. పలు వీధుల్లో పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్వహణ విధానాన్ని పరిశీలించి పలు ఆదేశాలిచ్చారు. సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్లాంట్‌లో జరుగుతున్న పెండింగ్ పనుల వివరాలు తెలుసుకున్నారు. ఎక్సెల్ ప్లాంట్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇన్సినరేషన్ పార్కు పనులను పరిశీలించి పార్కు పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఏఎస్ఎన్ ప్రసాద్, సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి సన్మానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూలై 11 ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ నియంత్రణ కార్యక్రమ అమలులో వివిధ హోదాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సన్మాన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసినితో కలిసి లక్కీడీప్ తీశారు. వివిధ పద్ధతుల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని లక్కీడీప్ ద్వారా ఎంపిక చేశారు. లక్కీడీప్‌లో ఎంపికైన వారు ఏయే ఆస్పత్రుల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్నారో ఆయా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బందిని సత్కరిస్తామన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కౌన్సిలర్లకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామని చెప్పారు. వైద్యాధికారులు జె.ఉషారాణి, ఎస్.లక్ష్మోజి పాల్గొన్నారు.



లక్కీడీప్ తీస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, డీఎంహెచ్‌వో సుహాసిని

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన

మధురానగర్(విజయవాడసెంట్రల్): గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కించపరిచే విధంగా మాట్లాడటం సిగ్గుచేటని పలువురు వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ అంబేడ్కర్ కాలనీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వలంటీర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. నాలుగేళ్ల కాలంలోనే వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

ప్రధాని సైతం ఈ వ్యవస్థను ప్రశంసించారని వారు గుర్తుకు చేశారు. కోవిడ్ సమయంలో బయటకు రావాలంటేనే బయపడుతున్న సమయంలో.. ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించామని చెప్పారు. అటువంటి వ్యవస్థను కించపరిచేలా పవన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పవన్ చేసిన దిగజారుడు విమర్శలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే సంఘీభావం

వలంటీర్లు చేస్తున్న నిరసన ప్రదర్శనకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ పెనుమత్స శిరీష సంఘీబావం తెలిపారు.

ప్రజల అవసరాలను తెలుసుకుని వారి ఇంటి వద్దకు వెళ్లి పారదర్శకంగా సేవలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. వలంటీర్ వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



అంబేడ్కర్ కాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు

శ్రీకాళహస్తి: సాయంత్రం వేళకు ఇంటికి చేరుకుంటామని ఫోన్ చెప్పిన తమ కుటుంబ సభ్యులు గంటల వ్యవధిలో విగత జీవులవుతారని కలలో కూడా ఊహించలేదని మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద కన్నీరుమున్నీరయ్యారు. గుండెలవిసేలా రోదించారు. వారి రోదనలు పలువురికీ కంటతడి పెట్టించింది. ఆదివారం మిట్టకండ్రిగ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విజయవాడ వాసులు ఆరుగురు మృత్యువాత పడటం విదితమే. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వస్థలాలకు తరలించారు. తమ అమ్మానాన్న మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని రేవంత్ విషణ్ణవదనంతో చెప్పాడు. తన తమ్ముడు భరత్ ఎవరు లేని అనాథగా మిగిలాడని ఆవేదన చెందాడు. తిరుమలకు శుక్రవారం బయలుదేరిన తన తండ్రి రమేష్, తల్లి రాజ్యలక్ష్మి, పెద్దమ్మ శ్రీలతకు ఫోన్ చేయగా సాయంత్రానికి ఇంటికి వస్తామని చెప్పారని అయితే వారంతా రోడ్డు ప్రమాదంతో తిరిగిరాని లోకాలకు చేరుకోవడం తమ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చిందని చెప్పారు.

మృతదేహాల తరలింపు

శ్రీకాళహస్తి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాద ఘటనాస్థలాన్ని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రమాదం ఆరుగురు మరణించడం బాధాకరమన్నారు.

అనంతరం ఏరియా వైద్యశాలకు చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ప్రభుత్వ ఖర్చులతో మృతదేహాలను వారి సొంత ఊర్లకు పంపుతున్నట్లు ఆర్డీవోరావు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్, రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్, సీఐ అంజుయాదవ్, కమిషనర్ బాలాజీనాయక్, తహసీల్దారు ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.

తిరుమల దర్శనానికి వెళ్తూ ఫోన్ చేశారు..

మేము తిరుమలకు చేరుకున్నాం.. దర్శనానికి వెళ్తున్నాం.. నువ్వు కూడా వచ్చి ఉంటే బావుండేది.. అని తన సోదరుడు రమేష్ ఫోన్ చేసి చెప్పాడని, అయితే ప్రమాదంలో కుటుంబం మొత్తం చనిపోయినట్లు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందడంతో హుటాహుటిన బయల్దేరి ఇక్కడికి వచ్చినట్లు జయరామ్ చెప్పారు. అవనిగడ్డ ప్రాంతం తమదని, తన అన్న రమేష్ విజయవాడలో స్థిరపడి కొడుకులను చదివించారని, భరత్ తల్లిదండ్రులను కోల్పోయినట్లు తెలియనివ్వలేదని, మృతదేహాలను అవనిగడ్డ తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన నరసింహమూర్తి, రమణి, అక్షయ మృతదేహాలను గుడివాడకు తీసుకెళ్తున్నామని అక్షయ మేనమామ శ్రీకాంత్ తెలిపారు.



అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది



మృతుల బంధువు నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- స్పందనకు 23 అర్జీలు
- వీఎంసీ మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో వారు పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన 20 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో ప్రధానంగా పట్టణ ప్రణాళిక విభాగం–8, ఇంజినీరింగ్ విభాగం–6, రెవెన్యూ–3, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ), ఎస్టేట్, పబ్లిక్ హెల్త్ విభాగానికి సంబంధించి ఒక్కో ఫిర్యాదు అందిందన్నారు. ఆయా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కారించాలని చెప్పారు. అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జగనన్నకు చెబుదాం 1902, స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌లను నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతి రోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు.

రికార్డుల తనిఖీ తప్పనిసరి..

జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించేందుకు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాల కార్యదర్శులను సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ సూచించారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల పనితీరును మెరుగుపరిచేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. విభాగాల ఉన్నతాధికారులు వారంలో తమకు కేటాయించిన సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని, నోటీసు బోర్డుల ద్వారా సమాచారం ప్రజలకు అందేలా పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ఏడీహెచ్ శ్రీనివాసు, ఎస్టేట్ ఆఫీసర్ ఓ.శ్రీనివాస్, బయోలజిస్ట్ డి.సూర్య కుమార్, మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమాల్లో సర్కిల్ -1, 3ల్లో పట్టణ ప్రణాళిక విభాగం నుంచి మూడు అర్జీలు అందాయి. అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్లు చెప్పారు.



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమైన ఘటనపై గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ అరండల్‌పేట హుస్సేన్ సాహెబ్ వీధికి చెందిన మహమ్మద్ సోహైల్ షరీఫ్ హైదరాబాద్‌కు చెందిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. కంపెనీ పనిమీద ఈనెల 6వ తేదీ హైదరాబాద్ వెళ్లి 9వ తేదీ తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం 5 గంటల సమయంలో తన సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లాడు. కొంత సేపటి తర్వాత తాను ఐలాపురం హోటల్ దగ్గర ఉన్నానని, ఇంట్లో సెల్ ఫోన్ మర్చిపోయాను తీసుకురావాలంటూ తన స్నేహితుడు అబ్దుల్లాకు ఫోన్ చేసి చెప్పాడు. అబ్దుల్లా అక్కడికి వెళ్లే సమయానికి మహమ్మద్ సోహైల్ షరీఫ్ అక్కడ కనిపించలేదు. షరీఫ్ తల్లిదండ్రులు చుట్టుపక్కల వారిని స్నేహితులు, బంధువులను ఆరా తీసిన అతని ఆచూకీ తెలియలేదు. దీంతో తన కుమారుడు కనిపించడం లేదంటూ షరీఫ్ తండ్రి మహమ్మద్ జావిదుల్లా గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సేకరణ బుట్టల అందజేత

పాతపాడు(విజయవాడరూరల్): జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పాతపాడు గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణ బుట్టలను అందజేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు తెలిపారు. ఎస్టీ కాలనీలో తడిచెత్త, పొడిచెత్త బుట్టలను పంచా యతీ సిబ్బంది సోమవారం పంపిణీచేశారు. వెంకటాపురం, అప్పారావుపేటలనూ ప్రతి ఇంటికీ చెత్త బుట్టలు అందజేశారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బాయన బాబూజీ మాట్లాడుతూ.. తమ క్లబ్ తరుపున చేస్తున్న సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అందులో భాగంగానే పేద బ్రాహ్మణ కుటుంబాలకు 10 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశామన్నారు. భవిష్యత్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ గుండారపు శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ మాలపాక భాస్కరరావు, మోహనరావు, ముదిలి మోహనరావు, గణేష్ సుబ్బారావు, గుత్తా శ్రీరామ్ పాల్గొన్నారు.

వస్త్ర దుకాణం వద్ద నిరసన

పటమట(విజయవాడతూర్పు): బీసీలపై దాడులను నిరోధించడానికి వీలుగా ఎస్సీ, ఎస్టీ చట్టం మాదిరిగా బీసీల పరిరక్షణ చట్టం తీసుకురావాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు కోరారు. ఇటీవల ధర్మవరం చేనేత చేనేత వ్యాపారులపై ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్ గుప్తా దాడిని నిరసిస్తూ ఆలయ సిల్క్స్ షోరూమ్ వద్ద కేశన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అవినాష్ గుప్తాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిరసన బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్వరాజ్యమైదానం కూడలిని సుందరంగా తీర్చిదిద్దండి

పటమట(విజయవాడతూర్పు): స్వరాజ్యమైదానం కూడలిని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్వరాజ్య మైదానం చుట్టూ ఉన్న ప్రదేశాలను, ఫుట్‌పాత్‌లను, డివైడర్స్‌ను మరింత అందంగా తీర్చిదిద్దడానికి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అంబేడ్కర్ స్మృతివనం విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన స్మృతివనం ఆవరణలో వర్షపు నీటిని గుంటలను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి వర్షపు నీటిని డ్రెయిన్‌లోకి మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల మోటార్లు ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరస్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ పార్కు పరిశీలన

నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం అధికారులతో కలిసి కృష్ణలంక జాతీయ రహదారి వెంబడి ఉన్న అంబేడ్కర్ పార్కును పరిశీలించారు.

పార్కులో జరుగుతున్న పునరుద్ధరీకరణ పనులను, గ్రీనరీని పరిశీలించారు. పార్కులో వేసిన గ్రానైట్ డిజైన్స్ ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కులో గ్రీనరీ పచ్చదనం పెంపుపై ఏడీహెచ్ మరింత దృష్టి సారించాలన్నారు. కమిషనర్ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వరాజ్య మైదానంలో ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

గృహాల రిజిస్ట్రేషన్లలో ఆటంకం లేకుండా చర్యలు

పటమట(విజయవాడతూర్పు): జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద కేటాయించిన గృహాల రిజిస్ట్రేషన్లలో ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కొత్త బిల్డింగ్ నందు గృహాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 7,210 ఇళ్లను ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి పరిష్కరించాలని చెప్పారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి చెల్లించవలసిన ఫీజుల వసూళ్ల కౌంటర్, డాక్యుమెంట్ కౌంటర్, ఈకేవైసీ కౌంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లతా, మేనేజర్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.